

ఎస్వీయూలో పీజీ సెట్ కార్యాలయం

తిరుపతి సిటీ:ఎస్వీయూనివర్సిటీలోని ప్రాచ్య పరిశోధన సంస్థలో బుధవారం ఏపీ పీజీ సెట్–2025 కేంద్ర కార్యాలయాన్ని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించారు.



ముగిసిన భద్రతా వారోత్సవం

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకను బుధవారం నిర్వహించారు. స్థానిక ట్రేడ్ సెంటర్‌లో చేపట్టిన కార్యక్రమంలో పరిశ్రమల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 540 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని 86 కేంద్రాల్లో బుధవారం ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ పేపర్–2 పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన పరీక్షకు 29,131మంది విద్యార్థులకు గాను, 28,591 మంది హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. 540 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. గురువారం ఇంటర్ ఫస్టియర్ మ్యాథ్స్–1ఏ, బోటనీ–1, సివిక్స్–1 పరీక్ష ఉంటుందని వివరించారు.



న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కామిరెడ్డి


కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్యనారాయణరెడ్డిని రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డికి ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు నన్నం ప్రస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం తదితరులు అభినందనలు తెలిపారు.

8న జాతీయ లోక్ అదాలత్


గురునాథ్, న్యాయమూర్తి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఈనెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లోని సివిల్, రాజీ కాదగిన క్రిమినల్ కేసులతో పాటు వివాహ, మోటారు వాహన ప్రమాదాలు, వ్యాజ్యం వేయని కేసులను పరిష్కరించనున్నట్లు వివరించారు. అదాలత్ కోసం కోర్టు ఆవరణలో 9 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తనతోపాటు ఈ బెంచ్‌లకు అధ్యక్షులుగా తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునీతారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, జూనియర్ జడ్జిలు కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, సత్యకాంత్ కుమార్, సంధ్యారాణి, సరిత వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.


మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

తిరుపతి అర్బన్ : ప్రపంచ మహిళా దినోత్సవా న్ని ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాల మైదానంలో ఆటల పోటీలు చేపట్టనున్న నేపథ్యంలో మహిళా ఉద్యోగులకు కలెక్టర్ ప్రత్యేక సెలవు మంజూరు చేసినట్లు ఏపీ జేఏసీ తిరుపతి చైర్మన్ ఎస్. సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆటల పోటీ ల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు మాత్రమే ప్రత్యేక సెలవు వర్తిస్తుందని వెల్లడించారు.

నేటి నుంచి అన్న ప్రసాదంలో మసాలా వడలు

తిరుమల : తిరుమల శ్రీవారి భక్తులకు అన్నప్రసాద కేంద్రంలో గురువారం నుంచి మసాలా వడలను వడ్డించనున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేతులమీదుగా వడల వడ్డన ప్రారంభించనున్నారు.

'క్వశ్చన్' మార్క్!


ఇంటర్ ప్రశ్నపత్రంలో సరిగా కనిపించని 13వ క్వశ్చన్

చిల్లకూరు : గూడూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశ్నపత్రంలో 13వ ప్రశ్న అస్పష్టంగా కనిపించింది. ప్రింటింగ్ సరిగా లేకపోవడంతో ప్రశ్నను గుర్తించేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సమాధానం రాయకపోతే 5 మార్కులు కోల్పోయే ప్రమాదముందని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ పరిస్థితి అర్థం చేసుకుని సక్రమంగి ప్రింట్ కాని ప్రశ్నకు సంబంధించి మార్కులు కలిపితే బాగుంటుందని కోరారు. అధికారులు సైతం జాగ్రత్తలు తీసుకుని ఇటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

దిగ్బంధం


వర్సిటీ ప్రధాన గేటు ఎదుట బైఠాయించిన వెటర్నరీ జూడాలు

వెటర్నరీ యూనివర్సిటీలో విద్యార్థుల ఆత్మ'గౌరవ' సమ్మె 31వ రోజుకు చేరుకుంది. వివక్షకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం తారస్థాయికి చేరింది. హాస్టళ్లను మూసివేసి కక్షపూరితంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఆగ్రహం మిన్నంటింది. బుధవారం ఈ మేరకు వర్సిటీని పశువైద్య విద్యార్థులు దిగ్బంధం చేశారు. ప్రధాన ద్వారానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. గేటు వద్ద బైఠాయించి ఉద్యోగులను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అందరితో సమానంగా స్టయిఫండ్ అందించాలని స్పష్టం చేశారు. నిరసనను నీరుగార్చేందుకు యత్నించడంపై మండిపడ్డారు.

31వ రోజుకు చేరిన పశువైద్య విద్యార్థుల సమ్మె

- వెటర్నరీ వర్సిటీ ఎదుట బైఠాయించిన జూడాలు
- హాస్టళ్లను మూసివేయడంపై ఆందోళన
- ప్రధాన ద్వారానికి తాళం వేసి నిరసన
- పోలీసుల రంగప్రవేశంతో ఉద్రిక్తత


విద్యార్థుల తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఇన్‌చార్జి వీసీ రమణ

తిరుపతి సిటీ : రాష్ట్రంలో అన్ని విభాగాల వైద్య విద్యార్థులతో సమానంగా గౌరవేతనం అందించాలంటూ గత 31రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులపై వర్సిటీ అధికారులు బెదిరింపులకు దిగారు. అందులో భాగంగా హాస్టళ్లను మూసివేశారు. దీంతో ఆగ్రహించిన పశువైద్య విద్యార్థులు బుధవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీని దిగ్బంధం చేశారు. వర్సిటీలోకి అధికారులు, ఉద్యోగులను ప్రవేశించకుండా గేట్లకు తాళాలు వేసి నినాదాలతో హోరెత్తించారు. లగేజీలను గేటు ముందు పెట్టి నిరసన తెలిపారు. సమ్మె విరమిస్తే కానీ, హాస్టళ్లను తెరవమంటూ అధికారులు హెచ్చరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

వర్సిటీ అధికారులు వ్యవహారశైలిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యార్థులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. వీసీ దురుసు ప్రవర్తనతోనే విద్యార్థులు సమ్మె బాట పట్టారని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

'వసతి'కి సుముఖత

విద్యార్థులు, వర్సిటీ అధికారులతో పోలీసులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో హాస్టళ్లను తెరిచేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు.

చుట్టుముట్టిన పోలీసులు

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వర్సిటీ వీసీ, అధికారులు హాస్టల్స్‌ను మూసివేయడంతో విద్యార్థులు భగ్గుమన్నారు. ఈ క్రమంలో వర్సిటీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. వర్సిటీ ప్రధాన గేటు పైనుంచి సమ్మె చేస్తున్న విద్యార్థుల వద్దకు పోలీసులు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏం జరుగుతుందో అర్థంకాక మహిళా విద్యార్థులు వణికిపోయారు. విద్యార్థులను నెట్టుకుంటూ వర్సిటీలోకి పోలీసులు ప్రవేశించారు. దీంతో విద్యార్థులు గేటు వద్ద ధర్నా చేపట్టారు.


వర్సిటీ వద్ద పోలీసు బలగాలు


వర్సిటీ గేటుకు తాళం వేయడంతో బయట వేచి ఉన్న అధికారులు, ఉద్యోగులు

బెదిరింపులు దారుణం



న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రశాంతంగా సమ్మె చేస్తున్నాం. అయితే వర్సిటీ అధికారలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. మహిళా విద్యార్థుల హాస్టళ్లను సైతం మూసివేసి బెదిరింపులకు దిగడం దారుణం. ఇటువంటి అధికారులు దేశంలోని ఏ విశ్వవిద్యాలయంలో కూడా ఉండరు. అయినప్పటికీ గౌరవవేతనం పెంచే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదు.
– మీడియాతో వెటర్నరీ విద్యార్థిని

ప్రభుత్వానికి నివేదించాం



విద్యార్థులు సమ్మె విరమించే వరకు హాస్టళ్లను తెరి చేది లేదు. ఇప్పటికే 31రోజుల పాటు సమ్మె చేయడంతో తరగతులు నిలిచిపోయాయి. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాని నివేదించాం. సమ్మె విరమిస్తేనే అన్నీ పరిష్కారమవుతాయి. విద్యార్థులు ఇప్పటికే విలువైన సమయం వృథా చేసుకున్నారు. – జీవీ రమణ, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

శ్రీలంక పర్యటనకు మహిళా వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకులు ఈ నెల 8వ తేదీ నుంచి రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించనున్నారు. స్టడీ ఇన్ ఇండియా ఎక్స్‌పో ఇన్ శ్రీలంక వారి ఆహ్వానం మేరకు కొలంబోలోని కింగ్స్‌బరి హోటల్‌లో నిర్వహించే ఎక్స్‌పో ప్రోగ్రామ్‌లో పాల్గొననున్నారు. బృందంలో రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డీన్ ఉష ఉన్నారు. పర్యటనలో ప్రధానంగా విదేశీ విద్యార్థులకు మహిళా వర్సిటీలో అందుబాటులో ఉన్న కోర్సులు, ఆధునిక పరిశోధన సౌకర్యాలపై చర్చించనున్నారు. అలాగే శ్రీలంకలోని కెలినియా వర్సిటీతో పలు అంశాలపై ఎంఓయూ కుదుర్చుకోనున్నారు.

సీఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయ కేతనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఇంటర్, ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఏ ఇంటర్ కోర్సులో సాయిప్రమోద్ 321, మనోజ్ 320 మార్కులు సాధించారని, వీరితో పాటు 59.37శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే సీఏ ఫౌండేషన్ కోర్సులో ఎస్ఐ.నందిని, డి.పల్లవి, డి.మీన, పి.చందనప్రియ, కె.రిషితతో పాటు 68.76 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని వారు అభినందించారు.

17 నుంచి దూరవిద్య పరీక్షలు?

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ నెల 17 నుంచి దూరవిద్య పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం వర్సిటీకి ఆదేశాల అందినట్టు సమాచారం. దీంతో అప్రమత్తమైన అధికారులు పరీక్షలు నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ రూపకల్పనపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

ఏకాంత వేళ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిదంపతులను పల్లకిలో శయన మందిరానికి వేంచేపు చేశారు. ఉత్సవర్లను ఊయలలో కొలువుదీర్చి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. శాస్త్రోక్తంగా శయన మందిరం తలుపులు మూసి అర్చకులు వెలుపలకి వచ్చేశారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి



ఉపాధికి 'సంకల్పం'


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప పథకం కింద జిల్లావ్యాప్తంగా ఆరు చోట్ల 270 మందికి ఉచితంగా వివిధ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీపీఓ సుశీలాదేవి పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఈ మేరకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, ఫ్యాబ్రిక్ కట్టర్, జనరల్ డ్యూటీ నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులకు సంబంధించి 90 మందికి నిర్వహిస్తున్న మూడు తరగతులను డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథడ్డి, ఉపాధి కల్పనాధికారి వెంకటరమణ, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి లోకనాథం, డీఎస్‌టీఓ ఫర్జానా, డీఏ మురళి పరిశీలించారు. అలాగే నారావారిపల్లిలో వివిధ కోర్సుల్లో 100 మందికి చేపట్టిన శిక్షణ తరగతులను డీపీఓ సుశీలాదేవి సందర్శించారు.

వేదఘోష

ముక్కంటి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద శాస్త్రోక్తంగా వేద పఠనం చేపట్టారు. శ్రీశైలం, తిరుపతి, కాణిపాకం, పెనుగంచిప్రోలు, విజయవాడ, అమరావతి, శ్రీకాళహస్తి ఆలయాలకు చెందిన పండితులు వేదపారాయణం చేశారు. ఈ క్రమంలోనే ధూర్జటి కళాప్రాంగణంలో సైతం నాలుగు వేదాలను పఠించారు. అనంతరం పండితులను ఈఓ బాపిరెడ్డి సత్కరించారు. – శ్రీకాళహస్తి



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,861 మంది స్వామివారిని దర్శించుకోగా 19,639 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

దోపిడీ దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : పగటిపూట వీధుల్లో సంచరిస్తూ తాళం వేసి ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడే దొంగలను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. ఫిబ్రవరి 2, 15వ తేదీల్లో తిరుపతి రూరల్ మండలం తిరుచానూరులోని శంకర్ నాయుడు కాలనీలో రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తిరుచానూరు పూడి రోడ్ లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా చోరీలకు పాల్పడింది జిల్లాకు చెందిన ముత్తుల తరుణ్ అలియాస్ దొంగ, ఆకతి అలియాస్ నవీన్ లప్పీ, డేరంగుల జగదీష్, పూతలపట్టు విఘ్నేష్ రెడ్డి, ఆకతి పెంచలయ్య, ముత్తుల తేజస్ అలియాస్ తేజ, మెట్టపల్లి లోకనాథ్ రెడ్డిగా గుర్తించారు. వీరంతా ముఠాగా ఏర్పడి పలు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుల నుంచి రూ.35లక్షల విలువైన 500 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి, ఓ కారు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ముద్దుల తరుణ్ పై 29 కేసులు, ఆకతి నవీన్‌పై 11 కేసులు, పెంచలయ్యపై 18 కేసులు, మిగిలిన వారిపై ఒక్కోకేసు ఇప్పటికే నమోదైనట్లు ఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన ఏఎస్పీ నాగభూషణం, డీఎస్పీ శ్యాం సుందర్ వారి సిబ్బందిని అభినందించారు.

బదిలీల చట్టంపై సమావేశం


మాట్లాడుతున్న గాజుల నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్ : ఉపాధ్యాయుల బదిలీల చట్టంపై బుధవారం తిరుపతిలోని ఎస్టీయూ భవనంలో సమావేశం నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ బదిలీల చట్టంలోని అసంబద్ధాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ చట్టం కారణంగా ఎవరూ నష్టపోకుండా సీనియారిటీ, స్టేషన్, ప్రిఫరెన్షియల్ కేటగిరీలకు సంబంధించి అందరికీ న్యాయం జరిగేలా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. 117 జీఓ రద్దు పేరుతో ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం చేయడం తగదన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ బడుల్లోని పిల్లలకు మాత్రమే పరిమితి చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం మాట్లాడుతూ బదిలీల్లో చట్టంలోని నిబంధనలపై కోర్టుకు వెళ్లకూడదనే అంశాన్ని తొలగించాలని కోరారు. అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్టే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ నేతలు గురుప్రసాద్, రేణుకాదేవి, రామాంజనేయులు, వాసు, సురేష్, దేవేంద్ర, శ్రీనివాసులు,మురళీకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

7 నుంచి డీడీఈ అడ్మిషన్లు


నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌బాబు

తిరుపతి సిటీ: ఈ నెల 7వ తేదీ నుంచి ఎస్వీయూ డీడీఈ పీజీ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఊక రమేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్వీయూ దూరవిద్య కేంద్రంలో బుధవారం నూతన డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దూర విద్యా కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి పీజీ అడ్మిషన్లు ప్రారంభించామని నోటిఫికేషన్ గురువారం విడుదల చేయనున్నట్టు తెలియజేశారు. డీడీఈ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

'ఎకో సెన్సిటివ్ జోన్'గా నేలపట్టు

తిరుపతి అర్బన్ : దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం పరిధిలోని రెండు కిలోమీటర్లను ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సూళ్లూరుపేట డివిజన్ డీఎఫ్ఓ, వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ అధికారి హారికతో కలిసి సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సెన్సిటివ్ జోన్‌గా ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన నిషేధిత అంశాలు, ప్రోత్సహించాల్సిన చర్యలపై మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా అక్కరపాకు, మైలంగం, ముచ్చల గుంట, నెలబల్లి, నెల్లూరుపల్లె, వెంగమాంబపురం, ఏకొల్లు, నేలపట్టు తదితర గ్రామాల పరిధిలో ఎకోజోన్ ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీఎఫ్ఓ నాగభూషణ్, సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ జయచంద్ర, సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ టీఆర్ వినోద్, ఎఫ్ఆర్ఓ సౌజన్య, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవికుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామి రెడ్డి, దొరవారి సత్రం తహసీల్దార్ శైలకుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్